క్లుప్తంగా

ప్రతిభకు ప్రోత్సాహం


విద్యార్థులకు నగదు అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

సత్యవేడు: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నగదు ప్రోత్సాహకం అందజేశారు. పూర్వ విద్యార్థి జక్కుల చొక్కలింగం ప్రథమ ర్యాంకు పొందిన జీ.గణేష్‌కు రూ. 10వేలు అంద జేశాడు. ఎస్. రమేష్‌రాజు ద్వితీయ ర్యాంకు సాధించిన జీ.శిరీషాకు రూ. 6 వేల నగదు, ఎం. ప్రవీణ్‌కుమార్ తృతీయ ర్యాంకు సాధించిన ఎం.దీపికకు రూ.4 వేలు హెచ్‌ఎం భారతి ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోహన్ బాబు, ఉపాధ్యాయులు మనోహర్, పాండు రంగయ్య, జేవీఎల్ కుమార్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

సత్యవేడు: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే క్రీడా కోటాలో కోరుకున్న కోర్సుల్లో సీట్లు సాధించే అవకాశాలు మెండుగా ఉంటాయని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులు 173 మందికి పుస్తకాలు, నోటు పుస్తకాలును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ రవి, ప్రిన్సిపల్ జగన్‌మోహన్ ఆచార్యులు, అసిస్టెంట్ ప్రిన్సిపల్ అనిల్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్రబాబు, శివరాం, దస్తగిరి, రాజేష్, సలీం, సురేష్, శర్మ, గీత, ఎంఈఓ–2 ఉష తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం


హెచ్‌ఎం భారతికి నగదు అందజేస్తున్న ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు

సత్యవేడు: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న 438 మంది విద్యార్థులకు కొత్త ఐడీ కార్డులు తయారు చేసేందుకు ఎస్‌ఎంసీ నూతన కమిటీ సభ్యులు రూ.4వేలు ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం కమిటీ చైర్మన్ టి. నందిని, వైస్ చైర్మన్ బోసుబాబు, సభ్యులు లీలావతి, వరలక్ష్మి, ఎం.నందిని, ఎస్ ఇంద్రాణి, వరలక్ష్మి, కామాక్షి, గాయత్రి కలసి ఐడీ కార్డుల తయారీకి అయ్యే ఖర్చును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మనోహర్, పాండురంగయ్య పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


మురుగునీటి నిల్వలను తొలగిస్తున్న డీఎల్‌పీఓ, సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: వ్యక్తిగత శుభ్రతతో పాటు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌పీఓ రవీంద్రబాబు తెలిపారు. శుక్రవారం ఆయన లక్ష్మీపురం గిరిజనకాలనీలో గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. గిరిజన కాలనీలోని వీధుల్లోని డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయించారు. తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకును శుభ్రం చేసి, క్లోరినేషన్ చేశారు. కాలనీలోని వీధుల్లో పారిశుద్ధ్యంపై ర్యాలీ నిర్వహించారు. దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలని, తాగునీటి కాచి వడపోసి తాగాలని, మురుగునీటి నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ
పలువురికి గాయాలు

శ్రీకాళహస్తి: మండలంలోని ఇనగలూరు గ్రామంలో ఇరువర్గాల మధ్య శుక్రవారం రాత్రి ఘర్షణ జరిగింది. దీంతో ఇరువర్గాల గాయపడి ఆస్పత్రిలో చేరారు. బాధితుల కథనం మేరకు.. ఇనగలూరు గ్రామానికి చెందిన రామయ్య పది ట్రిప్పుల ఇసుక తోలమని ట్రాక్టర్ యజమానికి నగదు ఇచ్చాడు. అయితే మధ్యలో వేరే వారికి తోలడంతో ఇరువర్గాల మధ్య గొడవ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో రామయ్య అనే అతనిపై వెంకట్రాయులు, కల్యాణి, విజయలక్ష్మి, భార్గవి, వరలక్ష్మి మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ దాడి సమయంలో వారి మధ్య జరిగిన పెనుగులాటలో ఇరువర్గాల వారికి గాయాలు అయ్యాయి. వారు ప్రభుత్వాస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. దీనిపై రాజకీయం చేసేందుకు నాయకులు రంగప్రవేశం చేసి, అధికార పార్టీ ఓ వర్గానికి కొమ్ము కాసింది. దీంతో ఆ ఘర్షణ రాజకీయరంగు పులుముకుంది. దీనిపై రూరల్ ఎస్‌ఐ పరమేశ్వర్ నాయక్ విచారణ జరిపి, కేసు నమోదు చేస్తామన్నారు.

రేపటి పౌరులు.. ఆరుబయట చదువులు

ఆ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు. బడి భవనం మాత్రం లేదు. దీంతో విద్యార్థులు ఆరుబయట కరుకు నేలనే తివాచీగా భావించి చదువు కొనసాగించాల్సి వస్తోంది. ఐదు తరగతుల్లో 50 మంది చిన్నారులు ఉన్న ఈ పాఠశాలకు ఒకటే తరగతి గది ఉండదంతో రేపటి పౌరుల చదువులు ఆరుబయట కొనసాగుతున్నాయి.

- తరగతులు ఐదు.. గది ఒకటే
- చిన్న పాండూరులో విద్యార్థుల అవస్థలు


చిన్న పాండూరు ప్రాథమిక పాఠశాలలో ఆరుబయట చదువుకుంటున్న విద్యార్థులు

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 53 మంది విద్యార్థులకు ఒకే తరగతి గది ఉంది. దీంతో పిల్లలకు ఒకే తరగతి గదిలో పాఠాలు బోధించలేక ఆరుబయట తరగతి గదులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకటి నుంచి 5 వరకు ఉన్న ప్రాథమిక పాఠశాలలో గత కొన్ని సంవత్సరాలుగా 50 మంది విద్యార్థులకు పైబడి ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారు. స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారుల సమన్వయంతో వర్షాకాలం వస్తే అందరికీ ఒకే గదిలో తరగతులు నిర్వహించడం, పాఠ్యాంశాలు బోధించడం అసాధ్యమవుతుందని స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి అదనపు తరగతి గది మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అరుదూరు, కడూరులో ఇదే పరిస్థితి

మండలంలోని అరుదూరు, కడూరు గ్రామాలలో ప్రాథమిక పాఠశాలల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. కడూరు పాఠశాల నిర్వహణ గ్రామ సచివాలయంలో కొనసాగిస్తున్నారు. అక్కడ సచివాలయ కార్యకలాపాల నిర్వహణకు వీరు అడ్డంకిగా మారుతున్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో ఓవైపు తరగతుల నిర్వహణ జరుగుతోంది. ఇలా ఇబ్బందిపడుతున్నా ఆ శాఖ అధికారుల స్పందన కరువైంది.

తక్షణమే నూతన భవనం నిర్మించాలి


నా ఇద్దరు పిల్లలు చిన్న పాండూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. అక్కడ ఉన్న విద్యార్థులందరికీ ఒకే తరగతి గదిలో విద్యాబోధన జరుగుతోంది. దీని కారణంగా పిల్లలు ఇబ్బందిపడుతున్నారు. ఇరుకు గదిలో పిల్లలకు విద్యాబోధన కూడా సరిగా అర్థంకావడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నూతన భవనం మంజూరు చేయాలి.

–శివ, చిన్న పాండూరు, అరుంధతివాడ

ప్రభుత్వానికి నివేదించాం


మండలంలోని చిన్న పాండూరు ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గది నిర్మాణం కోసం ప్రభుత్వానికి నివేదించాం. అక్కడ పిల్లలు పడుతున్న ఇబ్బందులను తెలియజేశాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. అలాగే అరుదూరు, కడూరు గ్రామాల్లో ఆగిపోయిన నాడు–నేడు పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

–సరస్వతి, ఎంఈఓ, వరదయ్యపాళెం మండలం

దేశభక్తి పెంపొందించుకోవాలి


భరతమాత చిత్ర పటాన్ని అందజేస్తున్న బాలాజీ

ఏర్పేడు: విద్యార్థులు చిన్నతనం నుంచి దేశభక్తి పెంపొందించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పలు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు భరతమాత చిత్ర పటాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు జాతీయ భావజాలంతో భారతదేశ సౌభాగ్యం కోసం కీర్తించదగిన ఉన్నత వ్యక్తులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో నాగరాజు, సాంబిరెడ్డి, దేవరాజులు, నిరంజన్, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీఎల్‌ఏకు సాదర స్వాగతం


సీసీఎల్‌ఏకు స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట: చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్(సీసీఎల్ఏ) జి.విజయలక్ష్మికి శుక్రవారం రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. తిరుపతి జిల్లా పర్యటన నిమిత్తం విచ్చేసిన ఆమెకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో పెంచలకిషోర్ పుష్పగుచ్ఛాలు అందజేసి, స్వాగతం పలికారు.

ఘనంగా మాతమ్మ తిరునాళ్ల

శ్రీకాళహస్తి: సున్నపుహరిజనవాడలోని మాత మ్మ తిరునాళ్ల శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ పూజల్లో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దావాల గిరి, ముని వెంకటే ష్, మనోజ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

మన చేతుల్లోనే మన ఆరోగ్యం


మాట్లాడుతున్న న్యాయమూర్తి బేబీరాణి

శ్రీకాళహస్తి: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని శ్రీకాళహస్తి న్యాయస్థాన సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు పట్టణంలోని లంకమిట్టలో శుక్రవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అనంతరం న్యాయమూర్తి బేబీ రాణి మాట్లాడుతూ ప్రతి ఇంట్లో ఆరోగ్యం, విద్య తప్పనిసరి అన్నారు. మన ఆరోగ్యాన్ని మనమే జాగ్రత్తగా కాపాడుకోవాలని తెలిపారు. మనం నేర్చుకున్న విద్య, సంస్కారం, కుటుంబ గౌరవాన్ని కాపాడుతుందన్నారు. ఏదైనా సమస్య ఉంటే అర్జీ రాసి న్యాయస్థానంలో అందజేస్తే ఉచిత సలహాలు, సూచనలు అందజేస్తారన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

నాగలాపురం: మండల కేంద్రంలో శనివారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏడీ చంద్ర నాయక్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పవర్ కట్ చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులు, లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, ఏర్పేడు, తొట్టంబేడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రేణిగుంటలో..

రేణిగుంట: రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలోని రేణిగుంట, తూకివాకం, గురవరాజుపల్లె, ఎల్లమండ్యం, గాజులమండ్యం, కుర్రకాల్వ విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో డీఈఈ ఎం.ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతు, విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల కత్తిరింపు కోసం శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: మండలంలోని వరదయ్యపాళెం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ శివప్రసాద్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనులు నిర్వహిస్తున్న కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పచ్చాలమ్మకు ప్రత్యేక పూజలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామంలోని పచ్చాలమ్మకు శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని గ్రామస్తులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ పచ్చాలమ్మకు అభిషేకాలు, విశేషాలంకరణ చేశారు. అనంతరం పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

వైభవంగా ధ్వజారోహణం

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం చేనేత సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిపారు. ఉదయం స్వామి అమ్మవార్ల విగ్రహాలకు పలు అభిషేకాలు, విశేష పూజలు చేశారు. పోతురాజు విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. శుక్రవారం రాత్రి శాస్త్రోక్తంగా స్వామిఅమ్మవార్ల ధ్వజారోహణం నిర్వహించారు.

స్టార్టర్ల చోరీ

ఏర్పేడు: మండలంలోని ఇసుకతాగేలి పొలాల్లో గురువారం రాత్రి రైతుల స్టార్టర్లు చోరీకి గురయ్యాయి. వ్యవసాయానికి పగటి పూట విద్యుత్ సరఫరా చేస్తుండడంతో రైతులు రాత్రి వేళలో పొలాల వద్దకు వెళ్లడంలేదు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి 12 మంది రైతుల స్టార్టర్లను పగులగొట్టి అందులోని కాపర్ వైరును అపహరించారు. చోరీపై ఎస్పీడీసీఎల్ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీఐలు బదిలీ

రేణిగుంట: రేణిగుంట అర్బన్, రూరల్ సీఐలు బదిలీ అయ్యారు. అర్బన్ సీఐ మల్లికార్జున, రూరల్ సీఐ సుబ్బరాయుడు తిరుపతి వీఆర్‌కు బదిలీ అయ్యారు. వారి స్థానంలో తిరుపతి మహిళా పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న శరత్‌చంద్ర రేణిగుంట అర్బన్ సీఐగా, తిరుపతి సీసీఎస్ నుంచి మురళీకృష్ణ రేణిగుంట రూరల్ సీఐగా బదిలీపై రానున్నారు.

సత్వర సేవలకు కృషి చేస్తాం


బాధ్యతలు స్వీకరిస్తున్న సురేష్‌బాబు

రేణిగుంట: ప్రజలకు అందుబాటులో ఉంటూ సత్వర సేవలు అందించడానికి కృషి చేస్తానని తహసీల్దార్ సురేష్‌బాబు తెలిపారు. మండల తహసీల్దార్‌గా సురేష్‌బాబు శుక్రవారం అధికారంగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందజేసి, స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయన మండలంలోని కరకంబాడి సమీపంలో ఉన్న కట్టపుట్టాలమ్మ ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

భూసమస్యలు పరిష్కరించాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలో భూ సమస్యలు పరిష్కరించాలని సీపీఐ నాయకులు తహసీల్దార్ మధుసూదన్‌రావు కోరారు. తొట్టంబేడు రెవెన్యూ కార్యాలయంలో ఆయన్ని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య మాట్లాడుతూ తొట్టంబేడు మండలంలో భూసమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. గత ప్రభుత్వంలో రౌతు సూరమాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన 50 కుటుంబాలకు భూ పట్టా పాసుపుస్తకాలు ఇచ్చారన్నారు. వారు ఆ భూమిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ రికార్డుల్లో లబ్ధిదారులపేర్లను రద్దు చేశారన్నారు. వారికి న్యాయం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ నాయకులు రుద్రపాక శ్రీనివాసులు, మించల శివ కుమార్, ధనంజయబాబు, చంద్రశేఖర్, మాసారపు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవంలో విద్యార్థుల ప్రతిభ


విజేతలతో ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు

ఏర్పేడు: స్థానిక హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన బాలోత్సవ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రధానోపాధ్యాయురాలు సునీత చెప్పారు. ఏర్పేడు హైస్కూల్‌లో జరిగిన బాలోత్సవ పోటీలకు మండలంలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు దేశభక్తి గేయాలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. దేశభక్తి గేయాల జూనియర్స్ విభాగంలో మండలంలోని పాపానాయుడుపేట హైస్కూల్ చెందిన ఏడో తరగతి విద్యార్థి రవికుమార్, సీనియర్స్ విభాగంలో అదే హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని ప్రతిమ మండలస్థాయి ప్రథమ స్థానం సాధించారు. బండారుపల్లె హైస్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని దీక్షిత ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నిర్మల్‌కుమార్, వెంకటరమణ, ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, శివకుమార్, రామచంద్రయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలను పారదోలాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు

నాగలాపురం: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో భారతదేశంలో కార్పొరేట్ సంస్థలను పారదోలాలని సంయుక్త కిసాన్ మోర్చా నేతలు పిలుపునిచ్చారు. నాగలాపురంలో శుక్రవారం సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారతదేశంలో కార్పొరేట్ సంస్థలు ప్రభుత్వరంగ సంస్థలను మింగేస్తున్నాయన్నారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగాలు రాకపోగా ప్రజా సంపద రూ.లక్షల కోట్లను కార్పొరేట్ కంపెనీలు కొల్లగొడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి మురుగేశన్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎం.దినమణి, అముదా, రైతు సంఘ నాయకులు దక్షిణామూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు జీడీపప్పు అలంకరణ

శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం జీడీపప్పుతో అలంకరించారు. శ్రావణ మాసం తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష అభిషేకాలు చేశారు. అనంతరం జీడీపప్పు, కర్జూరం, ద్రాక్ష తదితర ఎండు ఫలాలతో అలంకరించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వారికి ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.


జీడీపప్పు అలంకరణలో ముత్యాలమ్మ అమ్మవారు

ఘనంగా ఆరాధనోత్సవాలు

నారాయణవనం: మండలకేంద్రంలోని సొరకాయలస్వామి జీవసమాధి 122వ మహాగురుపూజ ఆరాధనోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం సహస్ర కలశాలను స్థాపన, ప్రత్యేక హోమాలు, మూలవర్లకు కలశ జలాల అభిషేకం నిర్వహించారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంత్రం పుష్ప పల్లకిపై సొరకాయల స్వామి ఉత్సవమూర్తిని ఊరేగించారు.

వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


చంద్రప్రభ వాహనంపై వీరభద్రస్వామి

నారాయణవనం: స్థానిక టీటీడీ అనుబంధ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం సాయంత్రం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు శుక్రవారం ఉదయం అంకురార్పణ చేశారు. సాయంత్రం వీరఖడ్గ చిత్రపటం ఉన్న వస్త్రాన్ని ధ్వజస్తంభం పైకి అధిరోహింప జేశారు. అనంతరం స్వామి వారు చంద్రప్రభ వాహనంపై విహరించారు. ఈ కార్యక్రమాలలో టీటీడీ స్థానిక ఆలయాల ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.

కల్పవృక్ష వాహనంపై శ్రీకృష్ణుడు


కల్పవృక్ష వాహనంపై శ్రీకృష్ణుడు


ఆకట్టుకున్న కేరళ సాంప్రదాయ వేషాలు

నారాయణవనం: మహాభారత ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కల్పవృక్ష వాహనంపై శ్రీకృష్ణుడు పురవీధుల్లో విహరించారు. ఊరేగింపులో ఏర్పాటు చేసిన కేరళ సంప్రదాయ వేషాలు, డ్రమ్ము వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. ఉదయం అర్జున తపస్సు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అర్జున వేషధారి తపస్సు మాను ఎక్కి పండ్లు, పూలను భక్తులు, మహిళకు అందజేశాడు. మహిళలు తపస్సుమానుకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం గాండ్ల సంఘం ఆధ్వర్యంలో ఉత్తర గోగ్రహణం కార్యక్రమం నిర్వహించారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఉత్సవంలో పాల్గొని, ఆలయ మర్యాదలు అందుకున్నారు. శనివారం ఉదయం అలుగు ఉత్సవం, ఆదివారం సాయంత్రం భక్తుల అగ్నిగుండ ప్రవేశం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త దేశప్పరెడ్డి పేర్కొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని కొత్తూరులో శుక్రవారం సీడీపీఓ శాంతి దుర్గ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీడీపీఓ శాంతి దుర్గ మాట్లాడుతూ బాల్య వివాహాలతో పలు ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. చిన్న వయసులో గర్భం దాల్చడంతో మాతా శిశు మరణాలు సంభవిస్తాయని చెప్పారు. సూపర్‌వైజర్ మంజుల పాల్గొన్నారు.


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ